ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

గురువారం 29 ఫిబ్రవరి 2024







ఎల్ఆర్ఎస్‌కు మోక్షం

- ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్‌తో దరఖాస్తుదారులకు ఊరట
- జిల్లాలో 43,149 పెండింగ్
- ఎల్ఆర్ఎస్‌తో రూ.100 కోట్ల ఆదాయం
- మార్చి 31 వరకు క్రమబద్ధీకరణకు గడువు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎల్ఆర్ఎస్‌కు మోక్షం లభించింది. అనుమతి లేని ప్లాట్లు, లే అవుట్‌ల క్రమబద్ధీకరణకు నాలుగేళ్లుగా నిరీక్షిస్తున్నా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఊరట కలగనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు దరఖాస్తులను పరిశీలించేందుకు సమాయత్తం అవుతున్నారు. మరోవైపు ఈ సారైనా ఎల్ఆర్ఎస్ ఇబ్బందులు తొలగిపోతాయో? మళ్లీ వాయిదా పడుతాయో? అనే సందిగ్ధం కూడా దరఖాస్తుదారుల్లో నెలకొంది. జిల్లాలో రెండు మున్సిపాలిటీలు, 255 గ్రామ పంచాయతీలు ఉండగా 43 వేల 149 దరఖాస్తులు ఎల్ఆర్ఎస్‌లోకి వచ్చాయి. జిల్లాలో ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.100 కోట్లకు పైగా ఆదాయం లభించనుంది. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు మార్చి 31 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది.

● దరఖాస్తుదారుల్లో చిగురిస్తున్న ఆశలు

లే అవుట్ లేకుండా రియల్ వ్యాపారులు తక్కువ ధరకు భూములను విక్రయించడంతో ప్లాట్లు వస్తున్నాయనే ఆశలో కొనుగోలు చేసిన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఎలాంటి లే అవుట్‌లు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ విచ్చల విడిగా అక్రమ లేఅవుట్‌లు ఏర్పాటు చేశారు. అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి అనుమతులు ఇవ్వకపోవడం, కఠినంగా వ్యవహరిస్తున్న క్రమంలో ప్లాట్ల కొనుగోలు దారులు గత ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. దీనిని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం అక్రమ లే అవుట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు 2015 నుంచి వివిధ దశల్లో లే అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించింది. అప్పుడు వచ్చిన దరఖాస్తులను రేండేళ్లపాటు పరిశీలించి క్రమబద్ధీకరించారు. మళ్లీ 2020 ఆగస్టులో ఎల్ఆర్ఎస్ పథకాన్ని తెచ్చింది. లే అవుట్ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఆహ్వానించారు. ప్లాట్లకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున, లే అవుట్ క్రమబద్ధీకరణకు రూ.10 వేల చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారిలో భవన నిర్మాణ అనుమతుల్లో కొంత వెసులుబాటు కల్పించినా క్రమబద్ధీకరణ జరగలేదు. ప్రస్తుతం భూమి విలువను బట్టి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. భూమి గజం విలువ రూ.3 వేల లోపు ఉంటే 20 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తారు. దీంతో పాటు అదనంగా నాలా కన్వర్షన్ ఫీజు కూడా చెల్లించాలి. భూమి విలువ రూ.3 నుంచి 5 వేల లోపు ఉంటే 30 శాతం, రూ.5 వేల నుంచి 10 వేల వరకు 40 శాతం, రూ.10 వేల నుంచి 20 వేల లోపు ఉంటే 50 శాతం, రూ 20 వేల నుంచి రూ 30 వేల వరకు 60 శాతం, రూ.30 నుంచి 50 వేల లోపు 80 శాతం, రూ.50 వేల పైనా ఉంటే వందశాతం చెల్లించాలి. నెల రోజులపాటు క్రమబద్ధీకరణకు అవకాశం ఉండడంతో ప్రభుత్వ నిర్ణయం ప్రకారం అధికారులు కూడా సిద్ధమయ్యారు. క్రమబద్ధీకరణలో అటవీ, దేవాదాయ, వక్ఫ్ బోర్డు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భూములతోపాటు కోర్టు కేసులు ఉన్న భూములను ఎల్ఆర్ఎస్ కింద పెండింగ్‌లోనే ఉంచుతారు.

జిల్లాలో 43,149 దరఖాస్తులు

జిల్లా వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు వచ్చిన 43,149 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో ప్లాట్‌కు గత మార్కెట్ ధరలకు అనుగుణంగా కనీసం రూ.20 నుంచి రూ.50 వేల వరకు ఆదాయం లభిస్తుంది. దీని ప్రకారం కనీసం రూ.100 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. జిల్లాలోని 255 గ్రామపంచా యతీల పరిధిలో 16,355 దరఖాస్తులు రాగా సిరిసిల్ల మున్సిపాల్టీలో 10,500 దరఖాస్తులు, వేములవాడ మున్సిపాల్టీలో 16,294 దరఖాస్తులు వచ్చాయి. వీటితోపాటు గ్రామపంచాయతీల్లో వచ్చిన దరఖాస్తుల్లో బోయినపల్లి మండలంలో 20 గ్రామపంచాయతీల్లో 645 దరఖాస్తులు, చందుర్తి 15 గ్రామపంచాయతీల్లో 213, ఇల్లంతకుంట 24 గ్రామపంచా యతీల్లో 1054, గంభీరావుపేట 17 గ్రామపంచాయతీల్లో 861, కోనరావుపేట 15 గ్రామపంచాయతీల్లో 277, వేములవాడ అర్బన్ మండలంలో తొమ్మిది గ్రామపంచాయతీల్లో 3909, ముస్తాబాద్ మండ లంలో 1074, ఎల్లారెడ్డిపేట 16 గ్రామపంచాయతీల్లో 3949, తంగళ్లపల్లి 26 గ్రామపంచాయతీల్లో 3784, వేములవాడ రూరల్ మండలం 15 గ్రామపంచాయతీల్లో 214, రుద్రంగి రెండు గ్రామపంచాయతీల్లో 304, వీర్నపలి మూడు గ్రామపంచాయతీల్లో 71 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల పరిశీలనకు క్లస్టర్‌లుగా విభజించి పరిశీలనకు అధికార బృందాలను ఏర్పాటు చేసినా క్రమబద్ధీకరణ ముందుకు సాగలేదు. ప్రభుత్వం మారడంతో మళ్లీ ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు అవకాశం వచ్చింది.

ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడాలి

- రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- వేములవాడలో మహా శివరాత్రి జాతర ఏర్పాట్లపై సమీక్ష

7



పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు

వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలి

- సిరిసిల్లలో నేత కార్మికుల మహాధర్నా

7



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

వేములవాడ, ఫిబ్రవరి 28: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆది శ్రీనివాస్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గెలుపులో న్యాయవాదుల పాత్ర మరువలేనిదన్నారు. ఎన్నికలకు ముందు న్యాయవాదులు అందించిన మనోధైర్యం తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

7న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

వేములవాడ, ఫిబ్రవరి 28: వేములవాడ పురపాలక సంఘం వైస్ చైర్మన్ స్థానానికి మార్చి 7వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ చైర్మన్ పదవికి మధు రాజేందర్ రాజీనామా చేయడంతో ఏర్పడ్డ ఖాళీని భర్తీ చేసేందుకు 7వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నిక నిర్వహిస్తామని వివరించారు.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 28: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో మల్లికార్జున స్వామి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. అక్కమారి కాపు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఊరడి రాజిరెడ్డి, కూస రాజిరెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోవద్దు

- మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



మల్లేశం, రవిని పరామర్శిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 28 : తెలంగాణ ప్రజలు నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోవద్దని, అక్కడ కల్లివెల్లి కావద్దని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. హత్య కేసులో జైలు శిక్ష నుంచి విముక్తి లభించి వారం రోజుల క్రితం ఇంటికి చేరుకున్న జిల్లా కేంద్రంలోని పెద్దూర్‌కు చెందిన శివరాత్రి మల్లేశం, శివరాత్రి రవిని, అంతకుముందు విడుదలైన కోనరావుటపేటకు చెందిన దండుగుల లక్ష్మణ్‌ను, జగిత్యాలకు చెందిన హన్మంత్‌ను పెద్దూర్‌లో బుధవారం పరామర్శించారు. బాధితుల కుటుంబ సభ్యుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్ చేసిన సహాయానికి భావోద్వేగానికి గురవగా ఓదార్చారు. బాధితులు జైల్లో పడిన బాధలను తెలిపారు. గల్ఫ్ బాధితులపై సినిమా తీసి తమ బాధలను ఇక్కడి ప్రజలకు తెలియజేయాలని కేటీఆర్‌ను కోరారు. అనంతరం కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో వ్యవసాయ భూమి ఉన్నా నీళ్ల లేక, ఉపాధి అవకాశాలు లేక లక్షల సంఖ్యలో సోదరులు కుటుంబాలను విడిచి గల్ఫ్ వెళ్తున్నారన్నారు. గల్ఫ్ దేశాలలో ఇబ్బంది పడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సోదరులు శివరాత్రి మల్లేషం, శివరాత్రి రవి, దండుగుల లక్ష్మణ్, నాంపల్లి వెంకటి, జగిత్యాల జిల్లాకు చెందిన శివరాత్రి హన్మంత్ జైలు పాలై 18 సంవత్సరాలు కుటుంబాలకు దూరమైన వారి జీవితాలే ఒక ఉదహరణ అన్నారు. చందుర్తికి చెందిన నాంపల్లి వెంకటి విడుదలకు ఆలస్యమైందని, మరో నెలలో విడదల అవుతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వ్యవసాయం బాగైందని, ఉపాధి అవకాశాలు పెరిగాయని అన్నారు. ఇక్కడ అవకాశాలు ఉండి ఎక్కడికో వెళ్లి ఇరుక్కుపోయి ఇబ్బంది పడకూడదని, మన దేశంలో మన ఊర్లోనే ఉంటూ అవకాశాలను వెతుక్కుంటే ఆనందంగా ఉంటుందని అన్నారు. గల్ఫ్ జైల్లో ఇరుక్కు పోయిన ఐదుగురిలో నలుగురు విడదలై రావడం ఆనందంగా ఉందన్నారు. 2011లో వీరు గల్ఫ్ జైల్లో ఉన్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. సిన్సియర్‌గా ప్రయత్నం చేసి నేపాల్ ఖాట్మాండ్‌కు వెళ్లి చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు రూ.15 లక్షలు పరిహారం అందజేశామని అన్నారు. వెంటనే విడదల అవుతారని ఆశించామని, దురదృష్టవశాత్తు అక్కడి చట్టాల మార్పులతో కొన్ని ఇబ్బందులతో విడదల కాలేకపోయారని అన్నారు. ఎంతో మంది కృషితో ఈ రోజు ఏడు సంవత్సరాల జైలు శిక్షకాలం ఉండగా బయటకు రావడం వారి కుటుంబాలను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. 18 సంవత్సరాలు జైలు జీవితం గడిపిన వారిని కలసి పరామర్శించడంతోపాటు 18 సంవత్సరాలు జైల్లో ఉన్న వారికి తనవంతు సహాయం అందిస్తామన్నారు. గల్ఫ్ బాధితులకు సహాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ మాటను నిలుపుకోవాలని కోరారు. కాళ్లమీద నిలబడే విధంగా స్వయం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే విధంగా వ్యక్తిగతంగా సహాయం చేస్తానన్నారు. గల్ఫ్‌లో ఉండే తెలంగాణ ప్రజలు నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోయి కల్లివెల్లి కావద్దన్నారు. తెలంగాణలో అవకాశాలు కోకొల్లలు ఉన్నాయన్నారు. ఇక్కడే కుటుంబాలతో ఉంటూ సంతృప్తికరమైన జీవితాలను గడపాలని కోరుకుంటున్నామన్నారు. తనకు సహకరించిన కేంద్ర ప్రభుత్వంతోపాటు ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు భూక్య రెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మినారాయణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నంకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

వేములవాడ, ఫిబ్రవరి 28: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. బుధవారం మహాశివరాత్రి జాతర సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న అనంతరం స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలసి రాజరాజేశ్వరస్వామి వారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ అర్చకులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్‌స్వామివారి ప్రసాదం అందజేశారు.

రాణీప్రసాద్‌కు సబల పురస్కారం



అవార్డు అందుకుంటున్న రాణీ ప్రసాద్

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ కందేపీ రాణీప్రసాద్‌ను సబల సత్యభామ పురస్కారంతో సత్కరించారు. బుధవారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్ గోనెవెంకటేశ్వర్ సేవా సంస్థ పురస్కారాన్ని అందించింది. రాణీప్రసాద్ బాల సాహిత్యంతోపాటు సైన్స్‌లో రచనలతోపాటు పిల్లల కోసం 30 సంవత్సరాలుగా రచనలు, అనువాదాలు చేశారు. ఇందుకు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ అనంతలక్ష్మీ, నిహారికరెడ్డి, వెల్ది కవిత ఆమెను సన్మానించారు.

సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోల బదిలీ

సిరిసిల్ల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎస్ ఆనంద్‌కుమార్, మధుసూధన్‌లు బుధవారం బదిలీ అయ్యారు. సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్ కోరుట్లకు బదిలీకాగా హన్మకొండ ఆర్డీవో ఎల్ రమేష్‌ను సిరిసిల్లకు, వేములవాడ ఆర్డీవో మధుసూధన్‌లు జగిత్యాలకు బదిలీ చేయగా కోరుట్ల ఆర్డీవో ఎస్ రాజేశ్వర్‌ను వేములవాడకు నియమిస్తూ రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీసుల సేవలు మరువలేనివి



హోంగార్డు రవీందర్‌ను సన్మానిస్తున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28: పోలీసు సేవలు మరువలేనివని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన హోంగార్డు రవీందర్‌కు సన్మానించారు. పోలీసు ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందాల న్నారు. వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ. 10వేల చెక్కును అంద జేశారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, ఏఆర్ డీఎస్పీ గంగాధర్, ఆర్ఐ రమేశ్, హెచ్‌సీ రవీందర్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 184 మంది గైర్హాజరు
- హాజరైన 4125 మంది



పరీక్షకు హాజరైన విద్యార్థులు

సిరిసిల్ల ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. నిముషం ఆలస్యం నిబంధన ఉండడంతో విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో 18 కేంద్రాల ద్వారా పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 3858 ఉండగా ఒకేషనల్ 451 మంది ఉన్నారు. ఇందులో 4125 మ ంది పరీక్షలకు హాజరయ్యారు. 184 మంది గైర్హజరయ్యారు. ఇంటర్ విద్యార్థులు 154 మంది, ఒకేషనల్ విద్యార్థులు 30 మంది గైర్హజరయ్యారు. పరీక్షల నిర్వహణకు జిల్లా ఇంటర్ బోర్డు అధికారి మోహన్ పర్యవేక్షించారు.

లక్ష్యం పూర్తి చేయకుంటే చర్యలు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 28: ఉపాధిహామీ పనుల లక్ష్యాన్ని పూర్తి చేయకుంటే చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో శేషాద్రి హెచ్చరించారు. బుధవారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల పని దినాలు వంద రోజులు పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీడీ నర్సింలు, ఎంపీడీవో శ్రీనివాస మూర్తి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బోయినపల్లి ఎంపీపీ రాజీనామా

బోయినపల్లి, ఫిబ్రవరి 28: బీఆర్ఎస్ సభ్యత్వానికి బోయినపల్లి ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్ బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు పంపినట్లు ఎంపీపీ తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీటీసీలు, మండల అధ్యక్షుడు తనపై కుట్రపన్ని అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. పార్టీలో కొందరు నాయకుల తీరుతో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఎండుతున్న పంటలు.. ఆందోళనలో రైతులు

- సాగునీటి కోసం తల్లడిల్లుతున్న రైతాంగం



రహీంఖాన్‌పేటలో ఎండిన వరి



మేకలకు మేతగా మారిన పంట

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28: భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టిన రైతాంగానికి సాగునీరు అందక పోవడంతో తల్లడిల్లుతున్నారు. మండలంలో రోజురోజుకు భూగర్భ జలాలు అడుగుంటుతుండటంతో వరిచేన్లు వెనుకకుపడుతున్నాయి. మండలానికి ఇరువైపుల ప్రాజెక్టులు ఉన్నా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్నా ప్రస్తుతం కేవలం 0.93 టీఎంసీల నీరు మాత్రమే నిలువ ఉంది. మధ్యమానేరులో నీరు ఉన్నా అన్నపూర్ణ రిజర్వాయర్‌ను నింపడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నీటితో ఉంటే ప్రాజెక్టులోకి నీరువచ్చేదని, దీంతో బిక్కవాగు ప్రవహించేదని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అనంతగిరి, సిరికొండ, దాచారం గ్రామాలలో పంటలు ఎండిపోగా, ఇప్పుడు రహీంఖాన్‌పేట, నారెడ్డిపల్లె గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని రైతులు పేర్కొంటున్నారు. కొంతమంది రైతుల పంటలు పూర్తిగా ఎండిపోవడంతో మూగజీవాలకు వదిలేశారు. ప్రభుత్వం స్పందించి బిక్కవాగులోకి నీటిని విడుదల చేయాలని రైతులు కోరుచున్నారు.

పంటలు ఎండిపోతున్నాయి

- కూస నరేష్, రైతు రహీంఖాన్‌పేట



ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు. రహీంఖాన్‌పేటలో బావులు, బోర్లలో నీరు పూర్తిగా తగ్గిపోయింది. మరో నాలుగు రోజుల్లో నీటిని బిక్కవాగులోకి వదలకపోతే పూర్తిగా ఎండిపోతాయి. కనీసం పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి లేదు. రైతుల బాధలను ప్రభుత్వం అర్థం చేసుకొని నీటిని విడుదల చేయాలి. చేన్లలో మేకలు మేస్తుంటే తట్టుకోలేకపోతున్నాం.

మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28: మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ తెలిపారు. బుధవారం అయన మాట్లాడుతూ ముస్తాబాద్ మండలానికి చెందిన లకావత్ శ్రీరామ్ అనే వ్యక్తి ఓ బాలికను వేధించిన విషయంలో ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో 2019లో ఫోక్సో కేసు నమోదైంది. ఆ కేసు కోర్టులో పెండింగ్ ఉన్నందున, లకావత్ చిన్న మున్నా నాయక్ అనే వ్యక్తి కేసు రాజీపడేలా మాట్లాడి పంచాయతీ చేస్తానని అన్నాడన్నారు. ఇందుకు లకావత్ శ్రీరామ్‌ను రూ. 1.80 లక్షలు డబ్బుల ఇవ్వాలని, డబ్బులు ఇస్తే కేసు రాజీ చేస్తానని డిమాండ్ చేసాడన్నారు. అతని డిమాండ్ మేరకు రూ 1.80 లక్షలు లకావత్ చిన్న మున్నా నాయక్ అనే వ్యక్తికి ఇచ్చాడన్నారు. ఆ డబ్బులు తీసుకొని పంచాయతీ చేయలేదని లకావత్ శ్రీరామ్ లకావత్ చిన్న మున్నాపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి చిన్నమున్నానాయక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భూకబ్జా కేసుల్లో మరో ఐదుగురిపై కేసు

● పలువురు కార్పొరేటర్ల భర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28: భూవివాదాలు సృష్టించి అక్రమంగా భూమి యజమానుల వద్ద నుంచి డబ్బులు దోపిడీకి పాల్పడటమే కాకుండా నిర్మాణాల కూల్చివేతకు పాల్పడిన ఐదుగురు నిందితులపై కరీంనగర్ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. బుధవారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్ల భర్తలు ఎడ్ల అశోక్, తుల బాలయ్య, కాశెట్టి శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ వివేకానందపురి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మామిడి రవీందర్‌రెడ్డి తీగలగుట్టపల్లిలోని సర్వే నెంబరు 240ఏలో 744.97 చ.గ. స్థలాన్ని 2004 సంవత్సరంలో గోపడి సుగుణమ్మ, గోపడి రాజుల వద్ద కొనుగోలు చేశాడు. 2017లో గ్రామపంచాయతీ అనుమతితో ప్రహరీ, షెడ్ నిర్మించుకున్నాడు. ఇదే సర్వే నంబరులోని మూల అరుణాదేవి 26 ప్లాట్లు ఇంటిస్థలాలను విక్రయించగా వివిధ ప్రాంతాలకు చెందినవారు కొనుగోలు చేశారు. అయితే ఒక్కో ఇంటి స్థలం నుంచి 3 లక్షల రూపాయల వంతున ఇవ్వాలని రవీందర్‌రెడ్డిని కార్పొరేటర్ భర్త కాశెట్టి శ్రీనివాస్ బెదిరించాడు. అడిగిన డబ్బులు ఇవ్వనందున వారి ప్లాట్లకు వెళ్లే 40 అడుగుల రోడ్డు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ అక్కడ శ్మశానవాటికగా స్థానికులను ప్రోత్సహించి అక్కడే శవాలను ఖననం చేయిస్తున్నారు. 2019జనవరి 2న కార్పొరేటర్ భర్త ఎడ్ల అశోక్, మాజీ వార్డు సభ్యుడు అల్లిబిల్లి నగేష్‌తో కలిసి రవీందర్‌రెడ్డి నిర్మించిన ప్రహరీ, షెడ్, గేట్‌లను ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేయించారు.

కార్పొరేటర్ల భర్తలైన ఎడ్ల అశోక్, కాశెట్టి శ్రీనివాస్, తుల బాలయ్యలు రవీందర్‌రెడ్డిని పిలిపించి అక్కడి ప్లాట్ల యజమానులు ఒక్కొక్కరు రూ. 3 లక్షలు ఇవ్వాలని లేదంటే అక్కడే శ్మశానవాటికను నిర్మిస్తామని బెదిరించారు. దీంతో రవీందర్‌రెడ్డితో పాటు రాజమౌళి, రఘుపతిరెడ్డి తలా లక్ష రూపాయలు ఎడ్ల అశోక్‌కు ముట్టజెప్పారు. మిగతావారు డబ్బులు ఇవ్వలేదని 2020లో శివరాత్రి సమ్మయ్య ద్వారా ఎక్స్‌కావేటర్‌తో రోడ్డుపై గుంతలు తీయించారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో కరీంనగర్ రూరల్ ఠాణాలో ఐపీసీ సెక్షన్ 386, 452, 457, 506, 120-బి రెడ్‌విత్ 34 కింద నిందితులు ఐదుగురిపై బుధవారం కేసు నమోదు చేశారు. నిందితులు కార్పొరేటర్ల భర్తలు ఎడ్ల అశోక్, తుల బాలయ్య, కాశెట్టి శ్రీనివాస్‌లను అరెస్టు చేసి కరీంనగర్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ప్రస్తుతానికి వారికి 41ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇవ్వాలని న్యాయమూర్తి సూచించినట్లు పోలీసులు తెలిపారు.

మహా శివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలి

● రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ● వేములవాడలో జాతర ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 28: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మార్చి 7,8,9వ తేదీలలో జరుగునున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాలను ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వేములవాడలో బుధవారం నిర్వహించిన మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర ప్రారంభానికి ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పూజలలో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని, శాస్త్రపరంగా స్వామి వారి పూజలు ఘనంగా జరగాలని, భక్తులకు త్వరగా దర్శనం లభించే విధంగా చర్యలు తీసుకోవాలని, జాతర నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతర సందర్భంగా మార్చి 7 నుంచి మార్చి 9 వరకు వేములవాడకు ఎక్కువ బస్సు సర్వీసులు నడపాలని, మహాలక్ష్మి పథకం నేపథ్యంలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నందున అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తుల రద్దీ ఆధారంగా ఆర్టీసీ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన మార్గాలలో అదనపు సర్వీసులు నడపాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలు, పొలాలలో రైతుల సహకారంతో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్ల పక్కన ఉన్న బావులకు ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత కనిపించకుండా మూడు షిఫ్టులలో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, భక్తుల కోసం ఎక్కడికక్కడ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రత్యేక దర్శనానికి రూ.300 రుసుం

మహాశివరాత్రి జాతర సందర్భంగా గతంలో అందించే ప్రత్యేక పాసులను పూర్తిస్థాయిలో రద్దు చేస్తున్నామని, వాటి స్థానంలో ప్రత్యేక దర్శనానికి రూ.300 టికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. జాతర అనంతరం వేములవాడ క్షేత్రాన్ని శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికబద్ధంగా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. వేములవాడలో సైతం బ్రేక్ దర్శనం అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దాతల సహాయంతో భక్తుల కోసం 500 గదులతో అతిథి గృహాలను నిర్మించేందుకు ప్రణాళిక రూపొం దించాలని, దాతలకు కల్పించే సదుపాయాల అంశంలో శ్రీశైలం, తిరుపతిలో అవలంబించే విధానాలను అవలంభించాలని మంత్రి పేర్కొన్నారు. ఆలయ నిత్య అన్నదాన సత్రంలో సంఖ్యతో సంబంధం లేకుండా ఎంత మంది భక్తులు వచ్చినా ప్రతినిత్యం అన్నదానం చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని ఇందుకోసం అవసరమైన నివేదిక రూపొందించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసే మహాశివరాత్రి జాతరను విజయవంతంగా చేయాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే విధంగా వేములవాడ పట్టణాన్ని సన్నద్ధం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ మంత్రి, ప్రభుత్వ విప్ అందించిన సూచనలు పాటిస్తూ అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న చిన్న సమన్వయ లోపాలను పరిష్కరిం చుకొని పకడ్బందీగా జాతర నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశం అనంతరం ఆలయ పరిసరాలు, జాతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఎస్పీ నాగేంద్ర చారి, ఆలయ ఈఓ కృష్ణప్రసాద్, ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సీడీపీవో, ఇన్‌చార్జి సీడీపీవోలపై వేటు

మంథని, ఫిబ్రవరి 28: అక్రమాల ఆరోపణలు, ఫిర్యాదులు, విధుల దుర్వినియోగానికి పాల్పడిన మంథని ఐసీడీఎస్ సీడీపీవో, ఇన్‌చార్జి సీడీపీవోతో పాటు మరో సూపర్‌వైజర్‌పై జిల్లా కలెక్టర్ ముజమిల్‌ఖాన్ వేటు వేశారు. మంథని సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న పద్మశ్రీ, ప్రస్తుతం ఇన్‌చార్జి సీడీపీవో, రామగిరి సెక్టార్ సూపర్‌వైజర్ బండ రజితలను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమిల్‌ఖాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న మంథని ఐసీడీఎస్ సీడీపీవో పద్మశ్రీపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటిపై స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీన డీడబ్ల్యూవో, 26వ తేదీన వరంగల్ ఆర్‌డీజేలు విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ మేరకు మంథని ఐసీడీఎస్ సీడీపీవో పద్మశ్రీ విధులు సరిగా నిర్వహించలేదని, ఇన్‌చార్జి సీడీపీవో, రామగిరి సెక్టార్ సూపర్‌వైజర్ బండ రజితలు తమ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, కార్యాలయ సమాచారాన్ని బయట పరిచిందని పేర్కొంటూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుంజపడుగు సెక్టార్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహి స్తున్న గండు సరిత ఇన్‌చార్జి సీడీపీవోకు సహకరించిందని పేర్కొంటూ షోకాజ్ నోటీసు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఐసీడీఎస్ ఆఫీసులో కొనసాగుతున్న ఫిర్యాదులు, విచారణలకు తాత్కాలికంగా బ్రేక్ పడే అవకాశం ఉంది.

సంఘ బహిష్కరణపై కేసు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 28 : పట్టణంలోని మోచి సంఘం రెండు వర్గాలుగా విడిపోయి ఒక వర్గానికి చెందిన మోచి సంఘ కుల పెద్దమనుషులు మరో వర్గానికి చెందిన కుల సభ్యులను సామూహిక సంఘ బహిష్కరణ చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఉమ్మడిగా ఉన్న ఆస్తులను కులానికి చెందిన కొందరు ఆస్తులన్నీ తమవేనని ప్రచారం చేస్తూ మరో వర్గానికి సంఘం నుంచి బహిష్కరించినట్లు ప్రచారం చేస్తూ సంఘం ఆస్తుల్లో భాగస్వామ్యం లేదంటున్నారని సంఘానికి చెందిన కావల్ల పెంటయ్య తండ్రి లింగయ్య, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య

కొడిమ్యాల, ఫిబ్రవరి 28: మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన బొలుమాల దేవయ్య(61)బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు దేవయ్య అనారోగ్యంతో పాటు అప్పుల బాధలు భరించలేక వెటర్నరీ సెంటర్‌లోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని కుమారుడు బొలుమాల సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కత్తితో తండ్రిపై దాడి

మెట్‌పల్లి, ఫిబ్రవరి 28: మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరపేటలో కుటుంబ కలహాలతో తండ్రిపై కత్తితో దాడి చేసిన తనయుడి సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరపేట గ్రామానికి చెందిన రిత్వం కుమారుడు అయిన అక్బర్‌ఖాన్ కొంత కాలం వివాహం చేసుకున్న తర్వాత వేరు కాపురం పెట్టుకొని ఉంటున్నారు. కొన్ని రోజుల నుంచి అక్బర్ ఖాన్‌కు భార్యతో మనస్పర్థలు రావడంతో ఆమె తల్లిదండ్రుల వద్ద వెళ్లి ఉంటోంది. అప్పటి నుంచి తాగుడుకు బానిసై నా భార్య నాకు కావాలని అక్బర్‌ఖాన్ బుధవారం తల్లిదండ్రులపై గొడవకు దిగి తల్లిని కత్తితో పొడిచే క్రమంలో తండ్రి రిజ్వాన్‌ఖాన్ అడ్డుగా వచ్చాడు. అడ్డుగా వచ్చిన రిజ్వాన్‌పై దాడికి పాల్పడటంతో గాయపడిన రిజ్వాన్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రిజ్వాన్‌ఖాన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్బర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వలస కూలి ఆత్మహత్య

మల్లాపూర్, ఫిబ్రవరి, 28: గత తొమ్మిదేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి జీవనోపాధి నిమిత్తం మండలంలోని రత్నపూర్ గ్రామానికి వచ్చిన పెడికం వెంకటేష్(38) అనే వలస కూలి తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం మల్లాపూర్ పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పెడికం గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

రాముడి జన్మస్థలం గురించి మాట్లాడినట్లు నిరూపిస్తారా?

● బండి సంజయ్ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ మంత్రి పొన్నం



కొడుముంజలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణ భూమిపూజ చేస్తున్న మంత్రి పొన్నం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 28: రాముని జన్మస్థలం ఎక్కడ, రాముని అక్షింతలు ఎక్కడివి అని తాను మాట్లాడినట్లు ఎంపీ బండి సంజయ్ ప్రచారం చేస్తున్నాడని వాటిని సాక్ష్యాలతో నిరూపిస్తే సజీవ దహనానికి కూడా సిద్ధమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి శ్రీలక్ష్మినర్సింహాస్వామి వారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ పూర్ణాహుతితో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆయనకు ఆలయ అర్చకులు రామాచారి, విజయేంద్రచారీలు ఆశీర్వచనం గావించగా ఆలయాధికారులు శ్రీస్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం విలేకర్లతో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్‌ర్యాలీలో భాగంగా బండి సంజయ్‌కుమార్ రాముడు జన్మస్థలం ఎక్కడని, రాముని అక్షింతలు ఎక్కడివని అసలు ఈ ఎమ్మెల్యే తన అమ్మకే పుట్టాడా.. అని తన అమ్మను ఉద్దేశించి మాట్లాడిన తీరుపై విరుచు కుపడ్డారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వున్న తల్లులను, బీజేపీ పార్టీ అధిష్టానాన్ని ఒక్కటే కోరుతున్నానని, బండి సంజయ్ అన్న మాటలకు నా తల్లి రోధిస్తుందని భావోద్వేగానికి లోనయ్యారు. బిడ్డా నా తల్లి గురించి మాట్లాడావు జాగ్రత్త అని హెచ్చరించారు. ఆవేదనతో చెబుతున్న రాత్రంతా నిద్రపోలేదని అన్నారు. మళ్లీ పేపర్లలో, వాట్సప్‌లలో అమ్మ పేరుతో రాజకీయం చేస్తున్నావని నన్నే అంటున్నాడు. నేను నీలాగే రాజకీయాలు చేస్తున్నాను నాకు స్థానిక మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబుతో నాకు రాజకీయంగా శత్రుత్వం ఉంది, కానీ ఏ రోజు కూడా వాళ్ల కుటుంబ సభ్యుల గురించి మాట్లాడలేదని గుర్తు చేశారు. నేను ఒక హిందువునని, నేను భక్తుడినని, నేను మాత్రం బండి సంజయ్‌లాగా మాంసాహారం తినను అని ఎద్దేవా చేశారు. రాముడి జన్మస్థలం ఎక్కడ అని ప్రచారం చేస్తున్నారు. రాముని జన్మస్థలం గురించి అడిగే మూర్ఖుడు ఉంటాడా అని ప్రశ్నించారు. ఒకవేల నేను అని ఉంటే మీడియా చూస్తూ ఊరుకుంటుందా.. అని గుర్తు చేశారు. రామున్ని ఓట్ల రూపకంలో వాడుకుంటుంది మీరని, రాముని అంశంతో రాజకీయం చేస్తున్న మూర్ఖులు మీరని మండిపడ్డారు. ఎంపీగా చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. రోడ్లు, ఉపాధి హామీ పనులు తప్ప నిర్మాణాత్మక పనులు ఏమి చేశావో చెప్పాలన్నారు. హిందువునని చెప్పుకునే నీవు ఎంపీగా వేములవాడ క్షేత్రానికి ఏమి చేశావని నిలదీశారు. రాముని పేరుతో రాజకీయం చేసుడు, మత పరమైన అంశాలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకుని పబ్బం గడుపుతున్నావని విమర్శించారు. గత ఎంపీ ఎన్నికల సమయంలో నేను కూడా హిందువునే, నేను యజ్ఞాలు చేస్తాను, నేను భక్తున్నే వాడేవడు, వీడేవడు, ఈ హిందుగాళ్లు.. బొందుగాళ్లు అని కేసీఆర్ అన్న మాటలను సాకుగా చూపి ఎంపీగా గెలిచావని ఆరోపించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నువ్వు కరీంనగర్ ఎమ్మెల్యేగా మూడుసార్లు ఓడిపోయిన నువ్వు నన్ను రాజీనామా చేయమంటావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగుల కమలాకర్‌తో కుమ్మక్కై కావాలని ఎమ్మెల్యేగా ఓడిపోయి మళ్లీ వాడో వీడో అంటూ నోటికి వచ్చిన మాటలు మాట్లాడి సానుభూతి తెచ్చుకోవాలని చూసే నీ రాజకీయ రంగు ప్రజలు గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. భార్య మంగళసూత్రం విలువ తెలువని నువ్వు నా గురించి మాట్లాడుతావా అంటూ మండిపడ్డారు. వారి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్‌కుమార్ స్థానిక నాయకులు ఉన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

వేములవాడ మండలం కొడుముంజ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లిన పొన్నం ప్రభాకర్ ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాజీ సర్పంచ్‌లు కదిరే రాజ్‌కుమార్, పండుగ ప్రదీప్, నాయకులు పిల్లి కనుకయ్య, ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

పని కల్పించాలని రోడ్డెక్కిన పవర్‌లూం నేత కార్మికులు



సిరిసిల్లలో పవర్‌లూం కార్మికుల ర్యాలీ

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నేతన్నలకు పని కల్పించాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని, ప్రభుత్వ అర్డర్లు తక్షణమే ఇవ్వాలంటూ సిరిసిల్ల నేత కార్మికులు రోడ్డెక్కారు. బుధవారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి సీఐటీయూ, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అసాముల సమన్వయ కమిటీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, మహాధర్నా నిర్వహించారు. చేనేత విగ్రహానికి పూలమాల వేసి అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. ధర్నా నిర్వహించి ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర సంక్షోభాన్ని నివారించడంతో పాటు తక్షణమే బతుకమ్మ చీరలు, ప్రభుత్వ అర్డర్లు ఇవ్వాలని పెండింగ్ బకాయిలను సబ్సిడీ డబ్బులు, విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్‌లు మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ఉపాధి లేక పవర్‌లూం కార్మికులు, అసాములు వైపని, వార్పిన్ కార్మికులు, గుమస్తాలు, జాపర్లు, అనుబంధ రంగాల కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేయించిందని వాటికి సంబంధించిన బకాయిలు, యారన్ సబ్సిడీ బకాయిలు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా టెస్కోకు చెల్లించాల్సిన రూ 482 కోట్లు చెల్లించలేదన్నారు. సిరిసిల్లకు రూ.200 కోట్లు బకాయిలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పోరాటాలకు కలిసి రావాలన్నారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ కార్మికుల కోసం పార్లమెంట్‌లో ఒక్కసారైనా నోరు మెదపలేదని అన్నారు. పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, అసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి తదితరులున్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి : ఎస్ఈ

గణేష్‌నగర్, ఫిబ్రవరి 28: ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం వర్తిస్తుందని ఎస్ఈ గంగాధర్ తెలిపారు. లబ్ధిదారులు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నెంబర్, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు ఆందోళన చెందవద్దని, అధికారులకు సమర్పించిన దరఖాస్తులు ధ్రువీకరించిన తర్వాత నమోదు చేస్తారన్నారు. అర్హులైన వారందరికీ జీరో బిల్ అందజేస్తామన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే పరిశీలన అయ్యేంత వరకు విద్యుత్ సిబ్బంది బిల్లు వసూలుపై చర్యలు తీసుకోరన్నారు.

భూ కబ్జాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28: భూ కబ్జాలకు పాల్పడిన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన పెద్దూరు తిరుపతి అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. 1996లో తంగళ్లపల్లి మండలానికి చెందిన గజభింకర్ రాధాబాయి 1996లో 20గుంటల భూమిని కొని రిజిస్ట్రేషన్ చేసుకుందన్నారు. ఈ భూమిని పెద్దూరు తిరుపతి అనే వ్యక్తి బెదిరించి ఆక్రమించుకున్నాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుపతిపై తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని తెలిపారు. అమాయక ప్రజలను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

ఉద్యోగాల పేరిట రూ. 9 లక్షల టోకరా

- ఇద్దరిపై కేసు నమోదు

గంభీరావుపేట, ఫిబ్రవరి 28: అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకుల నుంచి గంభీరావుపేట మండలంలో ఇద్దరు వ్యక్తులు రూ.9 లక్షలు వసూలు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎర్రవల్లికి చెందిన అర్జున్, గర్జనపల్లికి చెందిన రాజు అనే ఇద్దరు వ్యక్తులు పలు ప్రాంతాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిటా ఏడుగురు యువకుల నుంచి రూ.9 లక్షల వరకు వసూలు చేశారు. డబ్బులు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఎలాంటి ఉద్యోగాలు రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు వారి ద్దరిని నిలదీశారు. గంభీరావుపేట మండలంలోని జగదాం బతండాకు చెందిన అజ్మీరా రమేష్ స్థానిక పోలీస్‌లను ఆశ్రయించాడు. రమేష్ ఫిర్యాదు మేరకు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఏడుగురు యువకుల వద్ద ఉద్యోగాల పేరుతో రూ. 9 లక్షలు వసూలు చేసినట్టు రాజు, అర్జున్‌లు ఒప్పుకున్నారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు రాజు, అర్జున్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకులు ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తేవాలని ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొట్టాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు ప్రచురించిన కరపత్రాన్ని బుధవారం గంభీరావుపేట మండలం మల్లుపల్లెలో కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ కాళేశ్వరం ప్రాజెక్టును కూల్చే కుట్ర పన్నుతోందన్నారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లకు మరమ్మతు చేసి ప్రాజెక్టును పునరుద్ధరణ చేపట్టాల్సిన ప్రభుత్వం అసత్య ఆరోపణలతో బీఆర్ఎస్‌ను బదనాం చేసే కుట్ర పన్నుతోందన్నారు. ప్రపంచంలోనే నంబర్ వన్ ప్రాజెక్టుగా పేరుగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఏర్పడిన చిన్న చిన్న సాంకేతిక లోపాలను భూతద్దంలో చూపిస్తూ ప్రాజెక్ట్ ప్రతిష్టను మంటగులపుతోందన్నారు. ఓట్ల కోసం రైతుల నోట్లో మట్టి కొట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిజనిజాలను ప్రజలకు వివరించేందుకు మార్చి 1న చలో కాళేశ్వరం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పెద్దపల్లి జడ్పీ చైర్మన్ మధుకర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై రూపొందించిన కరపత్రాన్ని చదివితే పూర్తిగా అర్థమవుతుందన్నారు.కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్టు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 28: వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి గ్రామంలో గల్ఫ్ దేశాలకు పంపిస్తానని మోసం చేస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ వెల్లడించారు. బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన పెగ్గెర్ల చంద్రశేఖర్ కోనాయపల్లి గ్రామంలో కార్యలయం ఏర్పాటు చేసుకుని అమాయకులను మోసం చేస్తున్నాడని తెలిపారు. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మల్యాల దర్గయ్య అనే వ్యక్తిని ఉపాధి నిమిత్తం ఉక్రెయిన్‌కు పంపిస్తానని, నెలకు లక్ష జీతం వస్తుందని నమ్మించి రూ.2 లక్షల 75 వేలు తీసుకుని, మోసం చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ కౌన్సిలర్



పార్టీలో చేరుతున్న కౌన్సిలర్ ఉమారాణి

వేములవాడ, ఫిబ్రవరి 28 : వేములవాడ పట్టణంలోని 24 వార్డు కౌన్సిలర్ అన్నారం ఉమారాణి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం నాడు స్థానిక మహాలింగేశ్వర గార్డెన్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి వైద్యాధికారి



పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి

ఇల్లంతకుంట, ఫిబ్రరి 28: మండలంలోని రేపాకలో కొనసాగుతున్న వైద్యశిబిరాన్ని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రజిత బుధవారం పరిశీలించారు. గ్రామంలో జాండీస్‌తో పలువురు బాధపడుతుండడంతో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, శీతలపానియాలకు దూరంగా ఉండాలని అన్నారు. గ్రామస్థులు కాచిచల్లార్చిన నీటిని తాగాలని, తాగునీటిని రోజు క్లోరినేషన్ చేయించాలని కార్యదర్శికి సూచించారు. మండల వైద్యాధికారులు శరణ్య, సుమన్, సిబ్బంది లలిత, నయిం, జవహార్, జోగిందర్, జయ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 28: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని జడ్పీటీసీ పుర్మాణి మంజుల లింగారెడ్డి అన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేట, మండెపల్లి తదితర గ్రామాలలో ప్రత్యేక నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రాళ్లపేటలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో విజేతకు రూ. 16వేల నగదును జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పుర్మాణి లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ అందజేశారు. నాయకులు మునిగెల రాజు, గుగ్గిళ్ల శ్రీకాంత్, హరిక రెడ్డి, గుగ్గిళ్ల భరత్ పాల్గొన్నారు.

అసెంబ్లీ ఆవరణలో శ్రీపాదరావు విగ్రహం ఏర్పాటు చేయాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28: మాజీ స్పీకర్ దివంగత శ్రీపాదరావు విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. పల్లెలో పుట్టి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్పీకర్‌గా వ్యవహరించి ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం చేపట్టాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28: కేంద్రప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం చేపట్టాలని కరీంనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి సూచించారు. మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం మండలకేంద్రంలో లాభార్థి సంపర్క్ అభియాన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కేంద్రప్రభుత్వ లబ్ధిదారులు 6500 మంది ఉన్నారని, వారిని నాయకులు ప్రత్యేకంగా కలిసి ప్రధాని నరేంద్రమోదీ లేఖను అందించాలని అన్నారు. మార్చి 5న ఇల్లంతకుంటలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ప్రధాన కార్యదర్శి సూదుల కిషన్, ఓబీసీమోర్చా జిల్లా కార్యదర్శి చెప్యాల గంగాధర్, నాయకులు భూమల్ల అనీల్‌కుమార్, పెంటల వేణు, ఆంజనేయులు, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, మ్యాకల మల్లేశం, రాజుగౌడ్, దేశెట్టి శ్రీనివాస్, రంగు రమేష్, పున్ని సంపత్, కుడుముల శ్రీహరి, తిరుపతి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'మహిళా లోకాన్ని అవమానించిన బండి సంజయ్'

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 28 : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మహిళా లోకాన్ని అవమానించారని కాంగ్రెస్ మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చేర్ల పద్మక్క అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లిపై ఎంపీ బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మహిళ సిరిసిల్ల పట్టణ అధ్యక్షురాలు వెల్మల స్వరూప, జిల్లా ఉపాధ్యక్షురాలు సానియా, మాజీ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ, రోజా, మండల అధ్యక్షులు, వార్డు కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 28: విద్యార్థులు సైన్స్‌ను నమ్మాలని, మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భాగ్యనగర్ రాజగోపాల్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు మోతిలాల్, స్టాఫ్ సెక్రెటరీ మల్లారపు పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28: మండలస్థాయి సైన్స్‌పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను పెద్దలింగాపూర్ ఎంపీటీసీ కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి అభినందించారు. గ్రామంలోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో బెగ్గలం స్వాతి, మణికంఠ ద్వితీయ బహుమతి సాధించారు.

ఆలయంలో చోరీ

వీర్నపల్లి, ఫిబ్రవరి 28 : వీర్నపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో మంగళవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం లోని హుండీ పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. గమనించిన అర్చకుడు, భక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై రాజురెడ్డి ఘటనా స్థలికి చేరుకొని దేవాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బందితో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట) ఫిబ్రవరి 28: ఇటీవల మండలంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య బుధవారం పరామర్శించారు. రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన నిమ్మల రాజు, కన్నడ డైరెక్టర్ చిదుగు రవి మరణించారు. బాధిత కుటుంబాలను ఆగయ్య పరామర్శించారు. ఆయన వెంట సెస్ డైరెక్టర్ వరస కృష్ణహరి, ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థినులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 28 : విభిన్న ఆలోచనలతో విద్యార్థులు విజ్ఞాన వేదికలో నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో జాతీయ సైన్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్, విద్యానగర్‌లోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం, సర్దార్‌నగర్‌లోని బడ్స్ అండ్ ఫ్లవర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌లో సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను ఆసక్తిగా విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పరిశీలించారు. శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఆకునూరి వెంకటేష్, బడ్స్ అండ్ ఫ్లవర్స్ స్కూల్ చైర్మన్ రామయ్యశర్మ, ప్రిన్సిపల్ కళ్యాణిశర్మ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో జాతీయ సైన్స్‌దినోత్సవం నిర్వహించారు. వాణీనికేతన్‌హైస్కూల్, వివేకానంద కాన్వెంట్, వల్లంపట్లలోని కేరళ పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. తొలుత సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి, జిల్లా పండరీనాథ్, శ్రీరాముల శ్రీధర్ పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట): వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాలలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో జాతీయ సైన్స్ దినోత్సవాని నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థుల సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి.

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాధకిషన్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : సైన్స్‌తోనే శాస్త్రీయ దృక్పథం పెంపొందుందని సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో తయారు చేసినటువంటి పాఠ్యాంశ కృత్యాలు, ప్రయోగాల ప్రదర్శనను ఎంపీటీసీ పులి రేణుక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్యం, ప్రభాకర్, రవి, చంద్రం, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.



ఇల్లంతకుంటలో సైన్స్‌దినోత్సవంలో విద్యార్థులు



ఎగ్జిబిట్‌లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బోయినపల్లి : జాతీయ సైన్స్ టైలర్స్‌డే సందర్భంగా మండలంలోని విలాసాగర్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేళా నిర్వహించారు. ఉపాధ్యాయినులు శోభారాణి, జ్యోత్స్న రాణి తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌బిషన్ ఏర్పాటు చేశారు. కర్సపాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్‌లు తిపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం



బహుమతి అందజేస్తున్న కేటీఆర్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 28 : జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని, క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిద్దామని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మదీన యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కేటీఆర్ కప్ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ నిర్వాహకులను అభినందిచారు. అంతకుముందు జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్స్‌లో ఏ వారియర్స్, సీవోసీ లెవన్ జట్లు తలపడ్డాయి. ఉత్కంఠంగా జరిగిన ఫైనల్స్‌లో ఏ వారియర్స్ విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, కల్లూరి రాజు, ఆకుల కృష్ణ, నాయకులు బొల్లి రామ్మోహన్, అన్నల్‌దాస్ వేణు, కుంబాల మల్లారెడ్డి, యూసుఫ్, రాపెల్లి ప్రవీణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆటోలో కేటీఆర్

బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారకరామారావు ఆటో ఎక్కి అందరినీ ఆశ్చర్యపరిచారు. క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆ సమయంలో కేటీఆర్‌ను కలవాలని సిరిసిల్లకు చెందిన ఆటో డ్రైవర్ మల్యాల దేవరాజు అక్కడికి చేరుకున్నాడు. బీసీ బంధు పథకంలో రూ.లక్ష సాయంతో ఆటోను కొనుగోలు చేశానని, ఒకసారి మిమ్మల్ని ఆటోలో తిప్పాలనే కోరిక ఉందని కేటీఆర్‌తో అన్నాడు. దీంతో కేటీఆర్ సరదాగా ఆటోలో కూర్చొని మైదానంలో చక్కర్లు కొట్టారు. కేటీఆర్‌తోపాటు ఆటోలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి కూర్చున్నారు.

ఎగ్జిబిట్‌లను పరిశీలించిన కేటీఆర్



పరికరాలను పరిశీలిస్తున్న కేటీఆర్

గంభీరావుపేట, ఫిబ్రవరి 28 : గంభీరావుపేట మండలం జగదాంబతండ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ నవ్వులు పూయించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సీవీ రామన్ చిత్ర పఠానికి పూల మాలలు వేశారు. సైన్స్ నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయలక్ష్మన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణ రావు, జడ్పి కో ఆప్షన్ హైమద్, ఎంపీటీసీలు ఎర్రం అంజిరెడ్డి, మూడ్ కవిత అంబర్‌సింగ్, నాయకులు హన్మంతరెడ్డి, సత్యం, రాజిరెడ్డి, వేణు, కుతూబ్, నవాజ్‌ఖాన్, తంహీద్ ఉన్నారు.

కాంగ్రెస్ హిందూ వ్యతిరేక పార్టీ

చందుర్తి, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ హిందూ వ్యతిరేక పార్టీయని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండల బీజేపీ అధ్యక్షుడు పొంచేంట్టి రాకేష్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌పై కాంగ్రెస్ నాయకులు అనుచిత వాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయలు చేయడం ఇప్పటికైనా మార్చుకోవాలని, బండి సంజయ్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. ఎంపీ చేసిన అభివృద్ధి కనబడకుంటే సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవాలన్నారు. రామయ్య అక్షింతలను రేషన్ బియ్యం అన్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. సంజయ్ యాత్రను అడ్డుకోడం మీ తాత తరం కూడా కాదని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతకుంట గంగాధర్, అంబాల శ్రీకాంత్, అయోధ్య పర్శరాములు, ముప్పిడి సత్తయ్య, బోరుగాయ తిరుపతి, చింతకుంట సాగర్, మెంగని శ్రీనివాస్, పేరుక రంజిత్, సిరికొండ తిరుపతి, మెడిశెట్టి శ్రీహరి, చిలుముల ప్రేమ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

రుద్రంగి, ఫిబ్రవరి 28: రుద్రంగి మండల కేంద్రంలోని 16వ వార్డులో సీసీ రోడ్డు, మురికి కాలువ నిర్మాణం కోసం జడ్పీ నిధులు మంజూరు కావడంతో బుధవారం జడ్పీటీసీ గట్ల మీనయ్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గట్ల మీనయ్య మాట్లాడుతూ రుద్రంగి అభివృద్ధి కోసం జడ్పీ నిధుల ద్వారా అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, ప్యాక్స్ డైరెక్టర్ కెసిరెడ్డి నర్సరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్, దసారి గంగారాజం, చేప్యాల గణేష్, గొల్లెం నర్సింగ్, తలారి నర్సయ్య బాసని ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 28: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నూతనంగా నియామకమైన అజ్మత్ ఉల్లా హుస్సేన్‌ను హైదరాబాదులో మండల కేంద్రానికి చెందిన మైనార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీలకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. మహమ్మదీయ మజీద్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ సాదుల్, మహ్మద్ అలీ, మహ్మద్ ఖాజా మొహినుద్దీన్ ఉన్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి28: నగరంలోని విద్యానగర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయం వార్షిక బ్రహ్మో త్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు వానమామలై పవన కుమారాచార్యుల వైదిక నిర్వహణలో ఉదయం అధ్యయ నోత్సవం జరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, అంకురార్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి, కోశాధికారి దూలూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మడతల మీరయ్య, సింగిరెడ్డి రాంరెడ్డి, బానాల మల్లారెడ్డి, కామ అంజిబాబు, ఉప కార్యదర్శులు గడ్డం గోపాల్, గడప సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్‌జీవో సంఘం
ఉద్యోగుల సమస్యపై పోరాడుతుంది

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 28: ఎన్‌జీవో సంఘం ప్రతి సమస్యపై పోరాడుతుందని టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. బుధవారం నగరంలోని వాణిజ్య పన్నుల శాఖ టీఎన్‌జీవో నూతన కమిటీ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడుతూ 317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ ఉపసంఘానికి టీఎన్‌జీవో పక్షాన అయన కృతజ్ఞతలు తెలిపారు. 317 జీవో వల్ల ఇబ్బందులు పడ్డ ఉద్యోగులందరికీ న్యాయం చేసే దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్, కమర్షియల్ టాక్స్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్‌హుస్సేన్, నూతన జిల్లా అధ్యక్షుడు గుంటి బిక్షపతి, కార్యదర్శి మహ్మద్ సలావుద్దీన్, కోశాధికారి శ్రీనివాస్, మహిళ జేఏసీ చైర్మెన్ ఇరుమళ్ళ శారద, విష్ణువర్ధన్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, నాల్గవతరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామస్వామి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో కోళ్లు మృతి

ముస్తాబాద్, ఫిబ్రవరి 28:మండలంలోని పోతుగల్‌లో మినుప దేవేందర్‌కు చెందిన కోళ్లపై కుక్కలు దాడి చేశాయి. దేవేందర్ కోళ్లను పెంచుతూ జీవనం వెళ్లదీస్తున్నాడు. వీధి కుక్కలు అర్ధరాత్రి ఇంటి వద్ద ఉన్న కోళ్లపై దాడి చేశాయి. దాదాపు 16 కోళ్లను చంపేశాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

కాళేశ్వరం జలాలు విడుదల చేయాలి



రాస్తారోకో చేస్తున్న రైతులు


ఇల్లంతకుంట, ఫిబ్రవరి 28: మండలంలోని బిక్కవాగులోకి కాళేశ్వరం జలాలను విడుదల చేయాలని రహీంఖాన్‌పేట రైతులు డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండలకేంద్రంలో బుధవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి ఇరువైపుల ప్రాజెక్టులు ఉన్నా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిడ్‌మానేరులో నీరు ఉన్నా అన్నపూర్ణ రిజర్వాయర్‌ను ఎడారిగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నపూర్ణ జలాశయానికి నీటిని విడుదల చేసి అక్కడి నుంచి బిక్కవాగులోకి వదలితేనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఇప్పటికే 200 ఎకరాల వరి ఎండిపోయిందని, పశువులు మేస్తున్నాయని, మరో వారం రోజుల లోపు నీరు విడుదల చేయకపోతే పూర్తిగా పంటలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో రహీంఖాన్‌పేట రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వండి

- చేనేత జౌళి శాఖ మంత్రిని కోరిన కేటీఆర్
- కేటీఆర్‌ను కలిసిన పవర్‌లూం ఆసాములు

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పనులు లేక మరమగ్గాలు నిలిచిపోయాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావును బుధవారం సిరిసిల్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పవర్‌లూం ఆసాముల సంఘం ప్రతినిధులు కలిసి సమస్యను విన్నవించారు. దీనికి స్పందించిన కేటీఆర్ చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఫోన్ చేసి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఏర్పడిన ఇబ్బందులను తెలుపుతూ ప్రభుత్వం బతుకమ్మ చీరలు, ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న మరమగ్గాల్లో 80 శాతం సిరిసిల్లలోనే ఉన్నాయని దీనిపై పద్మశాలీ నేత కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా గత ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చి ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వం బతుకమ్మ చీరలపై ఇంకా నిర్ణయం తీసుకోనట్లు ఉందన్నారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం చేసినట్లు ఆరోపిస్తున్నారన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్‌ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, దార్నం లక్ష్మీనారాయణ, ఆసాముల సంఘం ప్రతినిధులు రవి, అశోక్, రమేష్ తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరిసిల్లలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 28: ఆరు గ్యారెంటీల్లో మరో రెండు అమలు చేసిన సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ మాట్లాడారు. తెలంగాణ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నా రన్నారు టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి మ్యాన ప్రసాద్, కార్యదర్శి కాసర్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్మల స్వరూప, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మాజీ కౌన్సిలర్లు యెల్ల లక్ష్మీనారాయణ, రాగుల జగన్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కామినేని రవీం దర్, పద్మశాలి సంఘం సిరిసిల్ల అధ్యక్షుడు గోలి వెంకటరమణ, నాయకులు వైద్య శివప్రసాద్, రాపెల్లి కళ్యాణ, దేవదాస్, గుజ్జె రమేష్, రోజా, కిరణ్, శ్రావణ్, తాటికొండ శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్‌కూడలిలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. గృహజ్యోతి, సబ్సిడీ సిలిండర్ ప్రారంభమైన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేముల త్యనారాయణగౌడ్, కరెడ్ల కొండల్‌రెడ్డి, బుర్ర రాములు, ఓరగంటి తిరుపతి, యారటి కరుణాకర్, రంజాని నరేశ్, ఉచ్చిడి బాల్‌రెడ్డి, దేవయ్య, లక్ష్మారెడ్డి, ఫయాజ్, కనమేని శ్రీనివాస్‌రెడ్డి, మాదాసు అనిల్, రమేశ్, తలారి నర్సింలు, ఆంజనేయులు, భాను, అనమేని రాజు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల్లో మరో రెండు గృహజ్యోతి, మహాలక్ష్మి గ్యారెంటీ పథకాలు అమలు కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రెండు గ్యారెంటీ పథకాల అమలుతో నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

బండి సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 28 : సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేయడాన్ని ఖండిస్తూ కార్యక్రమం చేపట్టామన్నారు. బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు సిరస్వాల్ కైలాస్, ఎనగంటి నరేష్, ఉపాధ్యక్షుడు ఊరగొండ రాజు, నాయకులు మోర శ్రీహరి, గాజుల సదానందం, బర్కం లక్ష్మి, నవీన్‌యాదవ్, గరిపెల్లి ప్రభాకర్, గుడ్ల విష్ణు, ఇంజపురి మురళి, కోడం ఆనందబాబు, వేముల సురేష్, చొప్పదండి శ్రీనివాస్, పండుగ మాధవి, అంకారపు రాజు, పోతు శ్రీనివాస్, రచ్చ రాహుల్ పంపరి అర్జున్, సుంకరి బాలకిషన్, సరిమల్లె మల్లేశం, కోడం రామకృష్ణ, దూడం ప్రసాద్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు క్షీరాభిషేకం చేశాయి. పార్టీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలోని రాములపల్లెలో ఎంపీ బండి సంజయ్‌పై రాళ్ల దాడిని ఖండిస్తున్నామన్నారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలోని వివేకనంద కూడలిలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, యెల్ల గిరి, గోపి, తిరుపతి, బాధ నరేశ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : మారుమూల గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.12వేల కోట్ల నిధులు కేటాయించినందుకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ చిత్రపటానికి పార్టీ నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోరుకునే వ్యక్తిపై మంత్రి పొన్నం ప్రభాకర్ అసత్యపు ప్రచారం చేయడం సరికాదన్నారు. మాజీ మండల అధ్యక్షుడు బోడ మల్లేశం, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు మాలోతు ప్రకాష్, నాయకులు ప్రవీణ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.